దశలవారీగా సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి : నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలుచేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వినాయకనగర్ డివిజన్‌లోని కాలనీ, బస్తీవాసులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ఆయా ప్రాంత ప్రజలు మంగళవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, జేపీసీ వెంకన్న, హేమంత్‌రెడ్డి, తులసి, సురేష్, బాలకృష్ణ, ఫరీద్, పలు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన స్థానిక నేతలు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలు మంగళవారం మాజీమంత్రి డాక్టర్ విజయరామారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌తో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిశారు. బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్, పూసల బ్రహ్మాచారి ఉన్నారు.

ఉద్యమకారుల త్యాగాలు మరువలేనివి

అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు మరువలేనివని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్‌గా ఉప్పులేటి రాజేందర్, కో– కన్వీనర్‌గా రవికుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమాన త్యాగాలతోనే తెలంగాణను సాధించుకున్నామని, దాని ఫలితాలు అందరికీ కాకుండా కొందరికే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల హామీలో చెప్పినట్లు ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక కోట తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

దేశ భద్రతలో మరోసారి ముందుంటాం !

అల్వాల్: టెర్రరిస్టుల నుంచి దేశాన్ని కాపాడేందుకు మరోసారి యుద్ధ రంగంలోకి వచ్చేందుకు మేము సైతం ముందుంటామని మాజీ సైనికులు ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ నాయకులు గోపురం రమణారెడ్డి మంగళవారం నేరెడ్‌మెట్‌లోని రామ్మష్ణాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ కేంద్ర నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. దేశ సమగ్రతను విచ్ఛిన్నం చేయడానికి విదేశీ శక్తులు పన్నాగం పన్నుతున్నాయన్నారు. ఈ సమయంలో అందరూ ఏకతాటిపై వచ్చి దేశం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కాశ్మీర్ పహల్గాంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. నిందితులకు తగిన శిక్ష విధించడంతో పాటు దీనికి కారణమైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. జాతీయ జెండాలు చేతపట్టుకుని, భారత్‌మాతాకీ జై అంటూ.. నినాదాలు చేశారు. ఎల్లారెడ్డి, హైమారెడ్డి, కెప్టెన్ పెరుమాల్, కెప్టెన్‌శర్మ, రమేష్, కృష్ణ, కళిందర్‌సింగ్, ధనుంజయ, రవి పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

బ్యాంకును మోసం చేసిన వ్యక్తి రిమాండ్


అభిలాష్‌రెడ్డి

మేడిపల్లి: ఓ ఫైనాన్స్ సంస్థను బురిడీ కొట్టించడమే కాకుండా ఓ మాజీ సర్పంచ్‌కు కుచ్చుటోపి పెట్టి రూ. 40 లక్షలు కాజేసి, తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ జ్యోతినగర్‌కు చెందిన అభిలాష్‌రెడ్డి (36) బంగారం వస్తువులను ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.5,35,000లకు తాకట్టులో ఉన్నాయని, రిలియంట్ క్రెడిట్స్ లిమిటెడ్ బ్యాంకుకు వెళ్లి, తాకట్టు పెట్టిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని బ్యాంకులో పెట్టుకోవాలని సంప్రదించగా.. బ్యాంకు వారు ముత్తూట్‌కు సంబంధించిన రశీదులు, గుర్తింపుకార్డులను పరిశీలించి ఏప్రిల్ 25న రూ.5,35,000లను అభిలాష్‌రెడ్డి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ప్రాసెస్ కోసం ముత్తూట్ ఫైనాన్స్‌కు వెళ్లగా సాంకేతిక కారణాల వల్ల ప్రాసెస్ కాలేదని తెలుసుకున్న రిలియంట్ క్రెడిట్స్ లిమిటెడ్ బ్యాంక్ వారు తిరిగి అభిలాష్‌రెడ్డి డబ్బులు వాపస్ ఇవ్వాలని అడగగా.. ఫెక్ ట్రాన్స్‌ఫర్ స్క్రీన్ షాట్‌ను బ్యాంక్ వారికి చూపించాడు. డబ్బులు బ్యాంక్‌లో జమకాలేదని మరోసారి సంప్రదించగా అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో సదరు బ్యాంక్ అధికారులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ధరణి పోర్టల్‌లో పహాణిలోని తప్పులను సరిచేసి పట్టా పాస్‌బుక్ ఇప్పిస్తానని రూ. 40లక్షలు కాజేసిన కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు.

రామంతాపూర్ పెద్ద చెరువు



ఎఫ్‌టీఎల్ పరిధి చిన్న చెరువులో నిర్మాణాలు



కాలుష్య కాసారాలుగా

జంట చెరువులు !

- కబ్జాలతో కుంచించుకుపోయిన.. రామంతాపూర్ పెద్ద చెరువు, బస్తీలోని చిన్న చెరువు
- పరిరక్షించాలని కోరుతున్న ప్రజలు

రామంతాపూర్ : ఒకప్పుడు తాగునీరు, సాగునీరు అందించిన రామంతాపూర్ ప్రధాన రహదారి, వరంగల్ జాతీయ రహదారిలో ఉన్న పెద్ద చెరువు, అదే విధంగా పలు కాలనీలు, బస్తీల్లో ఉన్న చిన్నచెరువు కబ్జాలతో కుంచించుకుపోయి కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. గతంలో ఈ చెరువుల్లో చేపల పెంపకం ద్వారా వందలాది మంది గంగపుత్రులకు జీవనాధారంగా నిలిచిన ఈ జంట జలాశయాలు ప్రస్తుతం చెత్త, చెదారం, బురద పూడికతో సహజత్వాన్ని కోల్పోయి, దుర్వాసనను వెదజల్లుతున్నాయి.

నిర్ణయించని ఎఫ్‌టీఎల్ హద్దులు..

ఈ జంట చెరువులు సుమారు 51 ఎకరాల విస్తీర్ణంలో ఉండే పెద్దచెరువు దాదాపు 15 ఎకరాలు, 19 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చిన్న చెరువు కబ్జాలతో కుంచించుకుపోయి 9 ఎకరాలుగా మారాయి. రెండేళ్ల క్రితం పెద్ద చెరువుకు హద్దులు బఫర్ జోన్ ఎఫ్‌టీఎల్ పరిధి కబ్జాలు పోగా ప్రస్తుతం చెరువు ఉన్న విస్తీర్ణంపై మూడునెలల్లోగా నివేదిక ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు హెచ్‌ఎండీఏ జీహెచ్‌ఎంసీ రెవెన్యూ విభాగాలకు ఆదేశాలు జారీచేసిన ఇంతవరకు ఈ విభాగాల నుంచి ఎలాంటి నివేదికలు రాలేదని పలువురు చెబుతున్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి రెండు చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు అన్ని రాజకీయపార్టీలు పట్టించుకుని హైడ్రాపై ఒత్తిడి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువుల పరిరక్షణకు హైడ్రా స్పందించాలి



రామంతాపూర్‌లోని జంట చెరువులను సుందరీకరించేందుకు హైడ్రా ముందుకు రావాలి. ఇప్పటికే కబ్జాలతో కాలుష్యకాసారంతో ఉన్న చెరువులను పట్టించుకోకపోతే మరిన్ని కబ్జాలు జరిగే అవకాశం ఉంది. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు స్పందించకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేపడతాం.

– మోహన్‌కృష్ణ, మేడ్చల్ మల్కాజిగిరి సొసైటీ ఉపాధ్యక్షుడు

విద్యుత్ సమస్యను పరిష్కరించండి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కాలనీవాసులు

అల్వాల్ : కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మచ్చ బొల్లారం డివిజన్ హనుమాన్ టెకిడీ కాలనీవాసులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయిని పెంచడంతో పాటు మూడు ఫేజ్‌ల స్థాయికి విద్యుత్‌లైన్లను మార్చాలని కోరారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బీకే. శ్రీనివాస్, స్వరూపారాణి, శ్రీనివాస్, అనితలతో పాటు బీఆర్‌ఎస్ నేతలు డోలి రమేష్ తదితరులున్నారు.

నాలా పూడికతీత పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: నాలా పూడికతీత పనులను వేగవంతం చేయాలని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని కుటీయా టెంపుల్ దగ్గర కొనసాగుతున్న పూడికతీతపనులను మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపించే లోగా నాలా పూడికతీత పనులను పూర్తిచేస్తే ముంపు సమస్యను అధిగమించవచ్చన్నారు. దీనికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈ రఘు, ఏఈ రవళి, సిబ్బంది అఫ్రోజ్ విఘ్నేష్, హరిబాబు, డివిజన్ నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, వెంకటేష్, ఆనంద్, దేవేందర్, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

కబ్జాపై స్పందించిన రెవెన్యూ యంత్రాంగం

- ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశించకూడదని అధికారుల హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: కాప్రా మండలం, కుషాయిగూడ సర్వేనెంబరు 270/1లోని ×ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి× అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై గతంలోనే ఈ స్థలం ప్రభుత్వానిదని, రెవెన్యూ అధికారులు కంచె వేసి హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ స్థల వివాదం కోర్టు పరిధిలో ఉంది. కోర్టు పరిధిలో ఉన్న స్థలంలోకి (ఎవరితోనైతే కోర్టులో తలబడుతున్నారో) ప్రవేశించి చదును చేయడంపై ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై ప్రశ్నిస్తే వారి ఇంట్లో వివాహ వేడుక ఉందని, వంటలు చేసుకునేందుకు చదును చేసుకుంటున్నారని, సమాధానం రావడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం రెవెన్యూ సిబ్బందిని పంపి రక్షణ చర్యలు చేపట్టారు. వివాదంలో ఉన్న స్థలంలోకి ప్రవేశించకూడదని వారికి హెచ్చరికలు జారీచేసినట్లు తహసీల్దార్ సుచరిత తెలిపారు.


వివాదంలో ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నాచారం డివిజన్‌లో రూ.63 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నాచారం స్నేహపురికాలనీ పార్కులో రూ.13 లక్షలతో ఓపెన్‌జిమ్, రూ.50 లక్షలతో నాచారం అన్నపూర్ణ కాలనీలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులు, మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యతనిసున్నట్లు పేర్కొన్నారు. డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వినిత్, స్నేహపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులున్నారు.

దేవాదాయశాఖ తీరు సరికాదు !

మల్కాజిగిరి: శివపురికాలనీలోని భ్రమరాంబికాసహిత మల్లికార్జునస్వామి దేవాలయంపై దేవాదాయశాఖ అధికారుల తీరు సరికాదని దేవాలయ కమిటీ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల దేవాలయాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకోవడానికి అధికారులు హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని చెప్పారని అందులో వాస్తవం లేదన్నారు. కొందరు స్థానికులు దేవాలయంలో ఎలాంటి అవకతవకలు జరగనప్పటికీ స్వార్థంతో ఫిర్యాదు చేశారని, దీనిని ఆధారంగా చేసుకుని అధికారులు రావడం సరికాదన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని, హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం కమిటీ నడుచుకుంటుందని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

మల్కాజిగిరి: రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సఫిల్‌గూడ సిదార్థనగర్‌కు చెందిన గంపల శ్రీనివాసరావు(56) విశ్రాంత ఆర్మీ ఉద్యోగి. కాగా ప్రతిరోజూ సఫిల్‌గూడ నుంచి ఏఓసీ వెళ్లే మార్గంలో వాకింగ్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం శ్రీనివాసరావు ఇంటి పక్కన ఉండే కృష్ణ మృతుడి భార్యకు ఫోన్‌చేసి, రోడ్డు ప్రమాదం జరిగిందని సమాచారం ఇచ్చారు. ఆమె కుటుంబసభ్యులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని భర్తను తిరుమలగిరిలోని మిలిటరీ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడిన విద్యుత్ వైరు !

8 కూలర్లు, 6 బైక్‌లు దగ్ధం

బోడుప్పల్: బోడుప్పల్ ప్రధాన రహదారిలో 11 కేవీ విద్యుత్ వైర్ తెగి బైక్‌లు, కూలర్లు దగ్ధమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ ప్రధాన రహదారిలోని సద్గురు ప్లాజా అపార్ట్‌మెంట్ 11కేవీ విద్యుత్ వైర్లు ఉన్నాయి. మంగళవారం రాత్రి గాలికి విద్యుత్ వైరు తెగి కిందపడి, మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కన పార్క్ చేసిన 6 బైక్‌లు, ఓ కూలర్ షాపులోని 8 కూలర్లు కాలిబూడిదయ్యాయి. మేడిపల్లి పోలీసులు, విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రమేష్ (ఫైల్)

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్, సాయినాథపురం, ఆఫీసర్స్‌కాలనీకి చెందిన ఆర్.రమేష్ (30) ఫుడ్‌కోర్టు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి నాచారంలోని తన మిత్రుడి ఇంటికి బైక్‌పై వెళ్లి, మంగళవారం తెల్లవారు జామున తిరిగి వస్తుండగా హెచ్‌బీకాలనీ సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం


బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని సత్తిరెడ్డినగర్, లాలాపేట డివిజన్ లక్ష్మీనగర్ కాలనీవాసులకు ప్రతిఏటా వర్షం పడినప్పుడు ముంపు సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. గతేడాది డిసెంబర్‌లో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి సంయుక్తంగా కాలనీల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించామన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. సుమారు రూ.65 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం రెండు ఫీట్ల నాలా ఉండటంతో వర్షం పడినప్పుడు బ్యాక్‌వాటర్ వచ్చి సమస్య ఎక్కువయ్యేదని నిధులు మంజూరు కావడంతో బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. వర్షాకాలం ప్రారంభం కంటే ముందే పనులుపూర్తి చేస్తామన్నారు. శాశ్వత పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన డిప్యూటీ మేయర్‌కు డివిజన్ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

ఇలాగైతే పోయేదెలా ?

అధ్వానంగా రామాంజనేయనగర్ రహదారి


రామాంజనేయనగర్‌లో అధ్వానంగా మారిన రోడ్డు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ సొసైటీ సమీపంలోని రామాంజనేయనగర్‌లో రోడ్డు అధ్వానంగా తయారైంది. రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆయా కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారి రోడ్డుపై గుంతలో నీరుచేరి అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

అల్వాల్: మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్– 2025 అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్‌లో పాసైన విద్యార్థులు 3 నుంచి 21వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రాజు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలలో వివిధ కాంబినేషన్లలో కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని దోస్త్ అడ్మిషన్ల సమన్వయకర్త డాక్టర్ అడవి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9440867068 /9848574157 / 9849575428 /9392143106.

స్థానిక సమస్యలపై 'జెడ్సీ'తో సమీక్ష


జోనల్ కమిషనర్‌తో సమీక్ష నిర్వహించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కార్పొరేటర్ శ్రవణ్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి డివిజన్ సమస్యలపై జోనల్ కమిషనర్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. సఫిల్‌గూడ చెరువులో గుర్రపుడెక్క తొలగింపు, ఓపెన్‌జిమ్ పరికరాల ఏర్పాటు, ఎంట్రన్స్‌ఆర్చ్, చుట్టూ బండ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరామన్నారు. విమలాదేవీనగర్‌లో బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి అదనపు నిధులు, బాలసరస్వతీనగర్, ఎస్పీనగర్‌లో నాలా నిర్మాణ పనుల్లో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని, వర్షాకాలంలోగా పూర్తి చేయాలని కోరామన్నారు. కొన్ని పార్కుల్లో ఓపెన్ ఎయిర్ జిమ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను అభినందిస్తున్న సృజన స్కూల్ యాజమాన్యం

ఉప్పల్: మండల పరిధిలోని సృజన స్కూల్ విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల యాజమాన్యం స్కూల్ టాపర్లుగా నిలిచిన శుభం కుమార్ (585), శివచరణ్ (584), హర్షిత్‌కుమార్ (584)లను శాలువాలతో సత్కరించారు. తమ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు నిర్వాహకురాలు వాకిటి శ్రీలత తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొంగుతున్న డ్రైనేజీ !


గోపాల్‌నగర్ కల్వర్టు వద్ద పారుతున్న మురుగు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని గోపాల్‌నగర్ కల్వర్టు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పొంగిపొర్లి రోడ్లపై ఏరులై పారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం మురుగు రోడ్డుపై పారుతుండటంతో దుర్వాసన వెదజల్లుతుందని, స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.